క్లుప్తంగా

అనాథలకు అండగా నిలుద్దాం

గజ్వేల్‌రూరల్: తల్లి, దండ్రులకు దూరమైన అనాథ పిల్లలకు అండగా నిలుద్దామని టీపీటీఎఫ్ మండల నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని బంగ్లావెంకటాపూర్‌కు చెందిన మాస్టి నాగమణి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, తండ్రి ఆచూకీ లేకపోవడంతో అనాథలుగా మారిన ముగ్గురు పిల్లలను శనివారం పరామర్శించారు. విరాళాలు సేకరించి పిల్లల పేరున రూ.30వేలను పోస్టాఫీస్‌లో డిపాజిట్ చేసి మిగిలిన రూ.1500లను బాధిత కుటంబానికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులకు దూరమైన పిల్లలను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలన్నారు. హెచ్‌ఎం వేణుగోపాల్, ఉపాధ్యాయుడు ప్రభాకర్, గ్రామస్తులు సత్తిరెడ్డి, టీపీటీఎఫ్ నేతలు నరేందర్, రాజులు, శ్రీనివాస్, నాగరాజు, విద్యాసాగర్, ఎల్లయ్య, సత్తయ్య, గ్రామస్తులు రవీందర్‌గౌడ్, మిరాన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం



క్రీడాకారులతో బాహుబలి సింగర్ దీపు

చిన్నకోదూరు(సిద్దిపేట): క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని బాహుబలి ఫేమ్ సింగర్ దీపు అన్నారు. మండల పరిధిలోని చంద్లాపూర్‌లో సూరగోని మల్లయ్య జ్ఞాపకార్థం వారి కుమారుడు సూరగోని శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొనాలన్నారు. ఈ మ్యాచ్‌లో విన్నర్‌కు రూ.10,116, రన్నర్‌కు రూ.5,116లతో పాటు బెస్టు బ్యాట్స్‌మెన్, బెస్ట్ బౌలర్‌లకు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

అంగడి ప్రారంభం



అంగడిని ప్రారంభిస్తున్న నాయకులు

గజ్వేల్‌రూరల్: మండల పరిధిలోని రిమ్మనగూడలో కూరగాయల అంగడి ప్రారంభమైంది. గ్రామస్తులు కూరగాయల కోసం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో శనివారం కొత్తగా కూరగాయల అంగడిని ప్రారంభించారు. ప్రతి శనివారం గ్రామంలో అంగడి నిర్వహిస్తారని గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బొల్లారం ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం: బీజేపీ జిల్లా నేత



వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న ఫొటోగ్రాఫర్స్

గజ్వేల్‌రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం చేస్తామని బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు చెప్యాల వెంకట్‌రెడ్డి చెప్పారు. గజ్వేల్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి బీజేపీ పక్షాన పోరాటం చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు వెంకట్‌రెడ్డిని సన్మానించారు. వైష్ణవి స్వామి, వెంకటేశ్‌చారి, వెన్నెల స్వామి తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంకు శుభాకాంక్షలు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాజలింగం, కిరణ్

చేర్యాల(సిద్దిపేట): డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం ఆయన కుమారుడు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్‌తో కలిసి శనివారం ప్రజాభవన్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భట్టిని కలిసి నూతన సంవత్సర, ముందస్తు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి ఫలితాలు వచ్చే విధంగా కృషి చేయాలని సూచించినట్లు చెప్పారు.

వరికి తెగులు.. రైతులకు దిగులు

యాసంగి వరి పంట తెగుళ్ల బారిన పడుతోంది. పచ్చపురుగు, లద్దిపురుగు, మొగిపురుగు తదితర వాటితో పంటలు తీవ్రస్థాయిలో దెబ్బతింటున్నాయి. నాట్లు వేసిన పక్షం రోజుల్లోనే పంట దిబ్బతినటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

- పచ్చపురుగు, మొగిపురుగుతో పంటలకు నష్టం
- వాతావరణ మార్పులతో దెబ్బతింటున్న పంటలు
- ఆందోళనలో అన్నదాతలు
- క్షేత్రస్థాయిలో పరిశీలించాలని వేడుకోలు



తెగులు సోకిన పంటకు పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

కోహెడ(హుస్నాబాద్): తెగుళ్లకు గురైయిన వరి పంటను కాపాడుకునేందుకు రైతులు ఎరువుల దుకాణదారులపై ఆధారపడుతున్నారు. పంటలకు ఏ మందు పిచికారీ చేయాలని నిర్వాహకులను అడిగి మందులు కొనుగోలుచేసి తమ సాగుకు వాడుతున్నారు.

వరిపైనే మక్కువతో..

ఈ యేడు రైతులు ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదైంది. దీంతో కుంటలు, చెరువులలో నీరు సమృద్ధిగా నిలిచింది. బావులు, బోర్లలో సైతం నీటి మట్టం పెరిగింది. దీంతో మండల వ్యాప్తంగా వరి సాగు ఘననీయంగా పెరిగింది. వరికి క్వింటాలుకు సుమారుగా దొడ్డురకమైతే రూ.2,300పైన, సన్నరకంకు క్వింటాలుకు మరో రూ.500 బోనస్ ప్రభుత్వం చెల్లించడంతో రైతులు వరిసాగుపై మక్కువ చూపారు. కాని మధ్యలోనే చీడపురుగుల బారిన పడటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించాలి



రెండెకరాలు వరిసాగు చేస్తున్న. పచ్చపురుగు, మొగిపురుతో పంట దెబ్బ తింటోంది. ఆకులు ఎరుపు రంగులో మారి ఎండుముఖం పడుతున్నాయి. దీంతో పంటకు నష్టం జరుగుతోంది. మునుపు ఎన్నడు లేనివిధంగా ఇప్పటికే రెండు సార్లు మందులు కొట్టిన. వ్యవసాయ అధికారులు పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. సమస్యను పరిష్కరించాలి.

– పేర్యాల నర్సింగరావు, రైతు, కోహెడ

వాతావరణ మార్పులతో సమస్య



వాతావరణ మార్పులతో పంటలు సమస్యలు బారిన పడుతున్నాయి. ఉష్ణోగ్రత తగ్గుతుండడంతో వరిసాగుపై తెగుళ్ల ప్రభావం పడుతోంది. నేల స్వభావంతో కూడా సమస్య తలెత్తుతోంది. తెగుళ్ల సమస్య ఉంటే రైతులు సమాచారం ఇవ్వాలి. క్షేత్రస్థాయిలో పంటను పరిశీలిస్తున్నాం. తగిన సలహాలు, సూచనలు అందిస్తున్నాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– సతీశ్, ఏఓ కోహెడ

సాగు వివరాలు

వ్యవసాయ అధికారుల అంచనా ప్రకారం మండల వ్యాప్తంగా సుమారు 21వేల ఎకరాలలో వరి సాగయింది. ఇప్పటికే తెగులు, పచ్చపురు, మొగిపురుతో సుమారు వెయ్యి ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో రైతుల్లో కలవరం మొదలైంది.

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

- నెలరోజులుగా అందని నీరు
- ఖాళీ బిందెలతో నిరసన



రోడ్డుపై ఖాళీ బిందెలను ఉంచి నిరసన తెలుపుతున్న మహిళలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని ఇటిక్యాల గ్రామంలో మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డెక్కి శనివారం నిరసన వ్యక్తం చేశారు. అరగంటపాటు రోడ్డుపై బిందెలు ఉంచి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ స్థానిక బీసీ కాలనీలో నెలరోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రావడంలేదన్నారు. పలుసార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీవాసులు కొంతడబ్బు పోగుచేసి బోరుబావిని తవ్వించుకున్నామని తెలిపారు. నిరసన విషయం తెలుసుకున్న జగదేవ్‌పూర్ పోలీసులు, మిషన్‌భగీరథ ఏఈ అక్కడికి చేరుకొని మహిళలతో మాట్లాడారు. తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో మహిళలు నిరసనను విరమించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ప్రతాప్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని ముస్త్యాల పంచాయతీ కార్యాలయం సమీపంలో తమ సొంత నిధులు రూ.2.50లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను స్థానిక ఎన్‌ఆర్‌ఐ డా.పెడతల ప్రతాప్‌రెడ్డి బాలమణిరెడ్డి దంపతులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి సహకరించడంలో తనకు ఎంతో సంతోషం కలుగుతుందన్నారు. ఇప్పటి వరకు చాలా పనులు చేశామని, మరిన్ని పనులు చేస్తామని చెప్పారు. వారి వెంట మాజీ సర్పంచ్ పెడతల యెల్లారెడ్డి ఉన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీకి విద్యార్థుల ఎంపిక

బెజ్జంకి(సిద్దిపేట): మహబుబ్‌నగర్‌జిల్లాలో జరుగుతున్న రాష్ట్రస్థాయి అండర్ 17 కబడ్డీ పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. బాలుర విభాగంలో గణేశ్, సాయిచరణ్, రుత్విక్, బాలికల విభాగంలో రేణుక, కృష్ణవేణి, శరణ్య ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ సంగీత, పీడీ కనుకరెడ్డి శనివారం తెలిపారు.

కంటి శుక్లాల సేకరణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మృతి చెందిన అన్నపూర్ణ కంటి శుక్లాలను నిర్వాహకులు అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేకరించి, ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి అందజేశారు. కార్యక్రమంలో మృతురాలి కుమారుడు మాంకాల శ్రీనివాస్, అలయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ ఆత్మరాములు, అంజయ్య, మధుసూదన్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి

నంగునూరు(సిద్దిపేట): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం మండలంలో చేపట్టిన సర్వే పూర్తయిందని ఎంపీడీఓ లక్ష్మణప్ప తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 24 పంచాయతీలకుగాను 9,562 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. వివిధ కారణాలతో కొన్ని దరఖాస్తులను తిరస్కరించగా 9,181 మంది వివరాలను ఆన్‌లైన్ చేశామని చెప్పారు.

పండుగలు సంస్కృతిని ప్రతిబింబిస్తాయి

పీసీసీ సభ్యుడు దరిపల్లిచంద్రం



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న చంద్రం తదితరులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పండుగలు మన సంస్కృతిని ప్రతిబింబిస్తాయని పీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం అన్నారు. జిల్లా కేంద్రంలోని సహస్ర పాఠశాలలో శనివారం నిర్వహించిన ముందస్తు సంక్రాంతి సంబురాలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్రాంతి పండుగను తలపించే విధంగా పాఠశాలలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ముగ్గుల పోటీకి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ నెల 14వరకు తమ ఇంటి వద్ద వేసిన మంచి ముగ్గులను వాట్సప్ నంబరు 81870 99333కు పంపించాలని చెప్పారు. మొదటి బహుమతి రూ.6వేలు, రెండో బహుమతి రూ.4 వేలు, మూడో బహుమతి రూ.3వేలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రావణ్, డైరెక్టర్ హారిక, ప్రిన్సిపాల్ శాంతి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

మిరుదొడ్డి(దుబ్బాక): వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలని ఎస్‌ఐ బోయిని పరశురాములు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని అల్వాలలో జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బైక్ నడిపే ప్రతి ఒక్కరు హెల్మెట్‌ను తప్పకుండా ధరించాలన్నారు. డ్రంకెన్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్ కేసుల్లో పట్టుపడితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి

సిద్దిపేటరూరల్: వడ్డే ఓబన్న 218 జయంతి ఉత్సవాలను బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఆర్‌ఓ నాగరాజమ్మ పాల్గొన్నారు. వడ్డెర కులసంఘాల నాయకులు మాట్లాడుతూ ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్ తరాలకు ఆయన స్ఫూర్తిదాయంగా నిలిచారన్నారు. జిల్లా అధికారులతోపాటు నాయకులు మహేందర్, శేఖర్, తిరుపతి, నవీన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేర చరిత్ర ఉన్నవాళ్లకు పార్టీలో స్థానంలేదు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నేర చరిత్ర ఉన్నవారికి కాంగ్రెస్ పార్టీలో స్థానం లేదని, కాంగ్రెస్ పార్టీ మహిళా, మైనార్టీ, యువజన, విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు. ఆ పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పార్టీ పేరుతో వివిధ రకాల నేరాలకు పాల్పడుతున్న వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేయించనున్నట్లు తెలిపారు. అలాంటి ముగ్గురు నాయకుల వివరాలను మైనంపల్లి హన్మంతారావు దృష్టికి తీసుకువెళ్లి, వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేయిస్తామన్నారు. కార్యక్రమంలో కలీమొద్దీన్, లక్ష్మి, వాహబ్, గయాజొద్దీన్, అజ్మత్, ఆంజనేయులు, సందీప్, శ్రీనివాస్, సాయి, వనజ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ విధులు, బాధ్యతలపై అవగాహన

వర్గల్(గజ్వేల్): మ్యాక్స్ చట్టం, సంఘ విధులు, బాధ్యతలపై శనివారం మండలంలోని జబ్బాపూర్‌లో స్వయం సహాయక సంఘాల మహిళలకు సెర్ప్ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సెర్ప్ కమ్యూనిటీ కోఆర్డినేటర్ నర్సింహులు మహిళలతో సమావేశం నిర్వహించి ఆయా అంశాలను వివరించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షురాలు భారతి, కార్యదర్శి లక్ష్మి పాల్గొన్నారు.

◆ పోలీసుల అభినందనలు

గజ్వేల్‌రూరల్: ద్విచక్ర వాహన పెండింగ్ చాలన్లను చెల్లించిన ఓ వ్యక్తిని పోలీసులు అభినందించారు. మండల పరిధిలోని బెజుగామకు చెందిన అందె కరుణాకర్ తన ద్విచక్రవాహనంపై ఉన్న 10 పెండింగ్ చలాన్లను రూ. 4,145 చెల్లించడంపై శనివారం అభినందించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏఎస్‌ఐ జగదీశ్వర్ శాలువాకప్పి సన్మానించారు. కరుణాకర్‌ను ఆదర్శంగా తీసుకొని చల్లాను చెల్లించాలని సూచించారు.

◆ మాజీ ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక

కొండపాక(గజ్వేల్): మండలంలోని దుద్దెడలో శంభు దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని కోరుతూ ట్రస్టుసభ్యులు మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డికి శనివారం ఆహ్వానపత్రికను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మంచాల శ్రీనివాస్, పెద్దంకుల శ్రీనివాస్, కాసం నవీన్, రవీందర్, ఐలయ్య, రుషి, కృష్ణమూర్తి, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

◆ క్రమ శిక్షణే విజయానికి తొలిమెట్టు

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రతి క్రీడాకారుడికి క్రమశిక్షణే తొలిమెట్టుగా నిలుస్తుందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి మండల ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ సీజన్–2ను మిరుదొడ్డిలో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. నైపుణ్య ఆర్గనైజర్ చైర్మన్, నిర్వాహకుడు ఐలయ్య, లింగం, బాల్‌రాజు, ఎండీ.అహ్మద్, భైరయ్య, రమేశ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఆటలతో మానసిక ఉల్లాసం

దౌల్తాబాద్(దుబ్బాక): దొమ్మాట గ్రామంలో సంక్రాంతి సంబురాలలో భాగంగా శనివారం నిర్వహించిన క్రికెట్ పోటీలను ఎస్‌ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ ప్రారంభించారు. ఆటలు మానసిక ఉల్లాసానికి ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. మాజీ ఎంపీటీసీ గన్నమనేని మోహన్‌రావ్, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు స్వామి, నర్రా రాజేందర్ పాల్గొన్నారు.

◆ బీజేపీ మండల అధ్యక్షుడిగా రాజు

బెజ్జంకి(సిద్దిపేట): బీజేపీ మండల అధ్యక్షుడిగా కొలిపాక రాజు మరోసారి ఎంపికయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కరీంనగర్ జిల్లా ఎన్నికల అధికారి సంకినేని వెంకటేశ్వర్‌రావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తనకు సహకరించిన కేంద్ర మంత్రి బండి సంజయ్, జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డికి రాజు కృతజ్ఞతలు తెలిపారు.

ఆటల్లో గెలుపోటములు సహజం

జనగామ ఎమ్మెల్యే పల్లా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

కొముురవెల్లి(సిద్దిపేట): ఆటలలో గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో ఆటలలో పాల్గొనాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో బీఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆటల వల్ల శారీరక దృఢత్వం, మానసికోల్లాసం కలుగుతుందన్నారు. దేశానికి ఎంతో మంది వాలీబాల్ క్రీడాకారులను ఉమ్మడి వరంగల్ జిల్లా అందించిందని గుర్తుచేశారు. మండలంలో 22వాలీబాల్ టీములు ఉండడం సంతోషకరమైన విషయం అన్నారు. ఆటలు నిర్వహిస్తున్న ఫౌండేషన్ చైర్మన్ రాజేందర్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో నర్సయ్య, శ్రీధర్, మహేశ్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయ అభివృద్ధికి కృషిచేస్తా

కాంగ్రెస్ నేత చెరుకు శ్రీనివాస్‌రెడ్డి



గ్రామస్తులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): శ్రీసింగరాల మల్లన్న దేవాలయ అభివృద్ధికి కృషిచేస్తానని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండలంలోని జప్తిలింగారెడ్డిపల్లి మల్లన్న దేవాయం వద్ద హైమాస్ లైట్లను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయం ప్రాంగణం వద్ద రూ.23లక్షలతో సీసీ రోడ్లు నిర్మించామని, హైమాస్ లైట్లు వేయించామని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషిచేస్తానని స్పష్టం చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అక్కం స్వామి, మాజీ సర్పంచ్ రాంరెడ్డి, నాయకులు మల్లారెడ్డి, నరేందర్ రెడ్డి, పందిరాజు, భూపాల్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, యాదయ్య, ప్రసాద్‌రెడ్డి, అనిల్, మహిపాల్‌రెడ్డి, ప్రవీణ్, షఫీ పాల్గొన్నారు.

వర్గీకరణతోనే అందరికీ న్యాయం

ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు పరశురాములు



మాట్లాడుతున్న పరశురాములు

చిన్నకోడూరు(సిద్దిపేట): వర్గీకరణతోనే మాదిగ ఉపకులాలకు న్యాయం జరుగుతుందని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు పరశురాములు అన్నారు. ఎమ్మార్పీఎస్ లక్ష డప్పులు, వెయ్యి గొంతుల కళాకారుల రథయాత్ర శనివారం చిన్నకోడూరు మండలంలో సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంద కృష్ణ నాయకత్వంలో 30 ఏళ్ల పోరాట ఫలితం తుది దశకు చేరిందన్నారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే మాదిగల ధర్మయుద్ధ సభకు మాదిగ ఉప కులాల వారు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. 20న సిద్దిపేటలో జరిగే సభకు మందకృష్ణ హాజరవుతారని చెప్పారు. ఎంఎస్పీ నాయకులు లక్ష్మణ్, యాదగిరి, బాలకృష్ణ, రాజు, రాములు, శ్రీనివాస్, మురళి, కళాకారులు పాల్గొన్నారు.

7న ఎమ్మార్పీఎస్ మహాసభ

బెజ్జంకి(సిద్దిపేట): ఎస్సీ వర్గీకరణ కోరుతూ ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించే ఎమ్మార్పీఎస్ మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం కళాకారుల ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి రమేశ్ పిలుపునిచ్చారు. బెజ్జంకిలో డప్పులతో కళా ప్రదర్శన చేశారు. 20న జిల్లా సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సురేశ్, శ్యాంసుందర్, భిక్షపతి, లక్ష్మణ్, పరశురాములు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు భరోసా

సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం



సీఎం రేవంత్ రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న చేనేత కార్మికులు

సిద్దిపేటజోన్: రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమం కోసం అభయ హస్తం పథకం ద్వారా భరోసా ఇచ్చిందని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ చేనేత వీవర్స్‌సెల్ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ చెప్పారు. ఈ ప్రకటనపై హర్షం వ్యక్తం చేస్తూ చేనేత కార్మికులు శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ చౌక్ వద్ద సీఎం రేవంత్ రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేసి సంబురాలు చేసుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని చేనేత, మరమగ్గాల కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు సాగుతోందన్నారు. నేతన్న పొదుపు, నేతన్న బీమా, నేతన్నకు భరోసా లాంటి పథకాల ద్వారా కార్మికులకు మనోధైర్యం వస్తుందన్నారు. కార్యక్రమంలో చేనేత సంఘాల ప్రతినిధులు మల్లికార్జున్, రవితేజ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో..

హుస్నాబాద్: హుస్నాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటానికి పద్మశాలి సంఘం నేతలు క్షీరాభిషేకం చేశారు. మండల అధ్యక్షుడు బూర్ల రాజయ్య, నాయకులు కొండ సత్యనారాయణ, భగవాన్, వడ్డెపల్లి వెంకటరమణ, వెంకట నారాయణ, వెంకటేశం, వడ్డెపల్లి బాలయ్య పాల్గొన్నారు.

దుబ్బాకలో..

దుబ్బాక: పట్టణంలో చేనేత కార్మికులు సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. చేనేత కార్మికులకు అభయహస్తం పథకంతోపాటు పలు స్కీంలను ప్రవేశపెట్టడడంపై కృతజ్ఞతలు తెలిపారు.

ఆకట్టుకున్న సంక్రాంతి ముగ్గులు



హుస్నాబాద్: నవ భారత్ స్కూల్‌లో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

హుస్నాబాద్: పట్టణంలోని నవ భారత్ హైస్కూల్‌లో శనివారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు రకరకాల రంగులతో ముగ్గులు వేశారు. పల్లె వాతావరణం తలపించేలా గుడిసెలువేసి భోగి మంటలు వేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రవి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గాయత్రీ వివేకానంద విద్యాలయంలో..

దుబ్బాకటౌన్: దుబ్బాకలోని గాయత్రీ వివేకానంద విద్యాలయంలో గంగిరెద్దు, హరిదాసు వేషధారణతో, రంగువల్లులు, భోగీ మంటలువేసి సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా విద్యార్థులు సంబురాలు నిర్వహించారు. ముగ్గులు, గాలిపటాల పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. హెచ్‌ఎం భాస్కర్‌రెడ్డి, సురేశ్, రేణుక, ఉపాధ్యాయులు శ్రీనివాస్, భాను చందర్, రవి, మహేశ్, మంజుభార్గవి, లత తదితరులు పాల్గొన్నారు.





దుబ్బాకటౌన్: ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు